సాక్షి
విశాఖపట్నం

ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



దంచికొట్టిన వాన

నగరంలో శనివారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. 8లో



వనం వదిలి.. జనంలోకి..

ఒకప్పుడు అడవులకే పరిమితమైన వన్యప్రాణులు వనం వదిలి.. జనంలోకి వచ్చేస్తున్నాయి. 8లో

మహా శ్రేష్టం.. మట్టి గణపతి



అగ్రగామి నగరంగా భాసిల్లుతున్న విశాఖలో పర్యావరణ హితంగా వినాయక చవితిని జరుపుకుందామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 8లో

న్యూస్‌రీల్

మహిళా ఎస్ఐ అభ్యర్థులకు ముగిసిన పరీక్షలు



పరుగు పోటీల్లో మహిళా అభ్యర్థులు

ఆరిలోవ: విశాఖ రేంజ్ పరిధిలో ఎస్ఐ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో భాగంగా మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు శనివారంతో ముగిశాయి. కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో గత నెల 30న మహిళా అభ్యర్థులకు పరీక్షలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆఖరి రోజు పరీక్షలకు 690 మందికి హాల్‌టికెట్లు పంపగా.. 555 మంది హాజరయ్యారు. వారికి బరువు, ఎత్తు, పరుగు, లాంగ్ జంప్ తదితర పరీక్షలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు జరిగిన దేహదారుఢ్య పరీక్షల్లో మొత్తం 2,745 మందికి గానూ 2,164 మంది హాజరయ్యారు. ఈ నెల 4 నుంచి పురుష అభ్యర్థులకు యథావిధిగా పరీక్షలు కొనసాగుతాయని రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్‌లో గణనీయ పురోగతి



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్ రంగం ఈ ఆర్థిక సంవత్సరంలో గణనీయమైన పురోగతి కనబరుస్తుంది. ఈ ఆగస్టులో విలువ ఆధారిత ఉత్పత్తులు గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 1,57,000 టన్నులు అమ్మకాలు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–ఆగస్టు వ్యవధిలో 5,57,000 టన్నుల విలువ ఆధారిత ఉక్కు అమ్మకాలు చేసి ఇప్పటిదాకా ఈ వ్యవధిలో చేసిన అమ్మకాల కంటే మెరుగైన రికార్డు సాధించింది. ఆగస్టులో 79 వేల టన్నులు వైర్ రాడ్ కాయిల్స్, 1,99,000 టన్నుల రీబార్స్, 46 వేల టన్నులు స్ట్రక్చరల్ ఉత్పత్తులు అమ్మకాలు చేసి గతంలో ఏ ఆగస్టులో లేని విధంగా అత్యుత్తమ విక్రయాలు సాధించింది. ఆగస్టులో రూ. 2,502 కోట్లు అమ్మకాలు చేసి గత ఏడాది ఇదే వ్యవధిలో జరిగిన రూ.1,806 కోట్లు అమ్మకాలు కంటే 39 శాతం వృద్ధిని నమోదు చేసింది.

జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం



చైర్మన్ రొంగలి జగన్నాథం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. అసోసియేషన్ చైర్మన్‌గా రొంగలి జగన్నాథం, గౌరవ అధ్యక్షుడిగా వి.సత్యనారాయణ, కన్వీనర్‌గా రాజాన వెంకట్రావు, ఆడిటర్‌గా ఎస్.రవీంద్రనాథ్, అధ్యక్షుడిగా గొంప చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా రంధి సాధూరావు, కోశాధికారిగా ఆర్.నరసింగరావు, ఉపాధ్యక్షులుగా పీఎస్ ప్రసాద్, పీఏ రాజు, పీవీఎస్ రాజు, ఎం.సంజీవరెడ్డి, బి.రామానాయుడు, సహాయ కార్యదర్శులుగా పిల్లా సూరిబాబు, గుర్రాల దేముడు, రాజాన రాంబాబు, టి.లక్ష్మారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అల్లు గోవింద్, సహాయ కోశాధికారిగా ఎస్.శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా పైలా కృష్ణారావు, వైఐవీ ప్రసాద్, జి.వీరభద్రరావు, సీహెచ్ ప్రసాదరావు, ఆర్.అప్పలనాయుడు, ఎంవీ సత్యనారాయణను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కేంద్ర సహాయ మంత్రి రాక నేడు

మహారాణిపేట: కేంద్ర పోర్ట్స్, షిప్పింగ్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద నాయక్ ఆదివారం విశాఖ వస్తున్నారు. సాయంత్రం 5 గంటలకు బెంగళూరులో బయలుదేరి.. 7.35 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 4న ఉదయం 9 గంటలకు పోర్టులో నౌకలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.10 గంటలకు విశాఖ నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళతారు.

మనసున్న మారాజు వైఎస్సార్

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్
- ఎండాడలో వైఎస్సార్ సీపీ జిల్లా నూతన కార్యాలయం ప్రారంభం



రక్తదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ జోనల్ విభాగం ఇన్‌చార్జిలు పద్మావతి, మారుతీ ప్రసాద్



వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గురువులు, ఎంపీ ఎంవీవీ, మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు

సాక్షి, విశాఖపట్నం: తెలుగు ప్రజల గుండెల్లో మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఎండాడ లా కళాశాల సమీపంలో వైఎస్సార్ సీపీ జిల్లా నూతన కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులుతో కలిసి ఆయన ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ కార్యాలయ ఆవరణలో రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్, మహానేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాలను రూపొందించి ప్రజల మనసుల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిస్తే.. తండ్రికి తగ్గ తనయుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. డిసెంబర్ నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటారని తెలిపారు. విశాఖకు సీఎం జగన్ వచ్చిన తర్వాత.. ఈ కార్యాలయాన్ని పార్టీ సెంట్రల్ ఆఫీస్‌గా కూడా వినియోగించుకుంటామని చెప్పారు. కోలా గురువులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రీజినల్ కో–ఆర్డినేటర్ సుబ్బారెడ్డి సూచనలతో పార్టీ కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించినట్లు చెప్పారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, సమన్వయకర్తలు కె.కె రాజు, ఆడారి ఆనంద్, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, ఎస్.ఎ.రెహమాన్, నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథం, బాబిరెడ్డి, చొక్కాకుల వెంకటరావు, బెహరా భాస్కరరావు, వెంపాడ శ్రీనివాసరెడ్డి, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి జి.రవిరెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కె.వి.బాబా, కార్పొరేషన్ చైర్మన్లు జాన్‌వెస్లీ, చొక్కాకుల లక్ష్మి, పిల్లా సుజాత, ముఖ్యనేతలు అక్కరమాని వెంకటరావు, కొండా రాజీవ్‌గాంధీ, నడింపల్లి కృష్ణంరాజు, వంకాయల మారుతీప్రసాద్, ద్రోణంరాజు శ్రీవత్సవ్, కె.రామన్నపాత్రుడు, పల్లా చినతల్లి, పీలా ఉమారాణి, పేడాడ రమణికుమారి, షరీఫ్, జోనల్, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఆత్మ బంధువుకు ఆత్మీయ నివాళి

సాక్షి, విశాఖపట్నం: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు జరిగాయి. వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు మహానేత విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఆస్పత్రులు, విద్యాలయాలు, అనాథ ఆశ్రమాల్లో అన్నసమారాధన, పండ్లు పంపిణీ చేపట్టారు. నిరుపేదలకు వస్త్రాలు అందజేశారు.

- తూర్పు నియోజకవర్గంలో 9, 12, 13, 16, 17, 18, 19, 20, 23వ వార్డుల్లో నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.
- మద్దిపాలెం వుడా లేఅవుట్ సమీపంలోని పార్టీ కార్యాలయంలో మహానేతకు పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ నివాళి అర్పించారు.
- దక్షిణ నియోజకవర్గం 29వ వార్డులోని జగదాంబ జంక్షన్ వద్ద వార్డు అధ్యక్షుడు పీతల వాసు ఆధ్వర్యంలో, 39వ వార్డులో కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొన్నారు.
- ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త కె.కె రాజు ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు జరిగాయి. 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టాభిరెడ్డి గార్డెన్స్ వద్ద వానప్రస్థ వృద్ధాశ్రమంలో నిర్వహించిన అన్నసమారాధనలో కె.కె.రాజు పాల్గొన్నారు.
- మధురవాడ, భీమిలి, తగరపువలస, ఆనందపురంలో నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బీచ్‌రోడ్డులోని వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ హరివెంకట కుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

- పరవాడ మండలం సంతబయలు జంక్షన్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నివాళులర్పించారు.
- గాజువాక బీసీ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

ప్రజల మదిలో వైఎస్ చిరస్మరణీయుడు

బీచ్‌రోడ్డు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల మనసుల్లో చిరస్మరణీయుడిగా నిలిచారని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా శనివారం బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. పార్టీ సీనియర్ నాయకులు అప్పారావు, శ్రీనివాస్, పల్లా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి బృహత్తర ప్రాజెక్టులు

- కైలాసగిరిపై రూ.18 కోట్లతో రివాల్వింగ్ రెస్టారెంట్
- వీఎంఆర్‌డీఏ పార్క్ వెనుక బీచ్‌లో రూ.8 కోట్లతో ఓషన్ డెక్
- ఎంజీఎం పార్కులో రూ.220 కోట్లతో 4 స్టార్ హోటల్, అమ్యూజ్‌మెంట్ పార్క్
- వైశాఖి జల ఉద్యానవనంలో రూ.22 కోట్లతో రిక్రియేషన్ జోన్
- మెట్రోపాలిటన్ కమిషనర్ మల్లికార్జున



మాట్లాడుతున్న మెట్రోపాలిటన్ కమిషనర్ మల్లికార్జున

దొండపర్తి: విశాఖ పర్యాటకాభివృద్ధికి నాలుగు బృహత్తర ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టినట్లు మెట్రోపాలిటన్ కమిషనర్, కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. శనివారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వీఎంఆర్‌డీఏ చేపట్టిన ప్రాజెక్టుల ప్రగతి, త్వరలో చేపట్టనున్న కీలక ప్రాజెక్టును వివరించారు.

- కైలాసగిరిపై గతంలో ప్రపంచ బ్యాంక్ నిధులతో చేపట్టి నిలిచిపోయిన కాటేజీలు, రివాల్వింగ్ రెస్టారెంట్ ప్రాజెక్టు పనులను తిరిగి రూ.18 కోట్లతో చేపట్టనున్నారు. కైలాసగిరిపై 2 ఎకరాల్లో రూ.5 కోట్లతో ఒక మినీ సైన్స్ సిటీని అభివృద్ధి చేయనున్నారు.
- వీఎంఆర్డీఏ పార్కు వెనుక ఉన్న బీచ్ నుంచి సముద్రంపైనే 45 మీటర్ల లోపలకు ఓషన్ డెక్ ప్రాజెక్టుకు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ డెలిగేట్లు సైతం ఇక్కడ సమావేశాలు నిర్వహించుకొనేలా కన్వెన్షన్ సెంటర్, ఫుడ్‌కోర్టులు, షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు సందర్శకులు సముద్రంపై నుంచి గ్లాస్ బ్రిడ్జ్‌పై నడుస్తూ సాగరతీర అందాలను ఆస్వాదించేలా రూ.8 కోట్లతో ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ(సీజెడ్ఎంఏ) నుంచి రెండు నెలల్లో అనుమతులు వస్తాయని అధికారులు భావిస్తున్నారు.
- ఎంజీఎం పార్కు స్థలంలో పీపీపీ విధానంలో రూ.220 కోట్లతో 200 రూమ్స్‌తో 4/5 స్టార్ హోటల్‌తో పాటు మైస్ సెంటర్, వాటర్ అమ్యూజ్‌మెంట్ పార్క్ ఏర్పాట్లు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే పీపీపీకి అనుమతులు వచ్చాయి. ఆసక్తి వ్యక్తీకరణకు వెళ్లనున్నారు.
- 8 నెలలుగా ఖాళీగా ఉన్న వైశాఖీ జల ఉద్యానవనంలో పీపీపీ పద్ధతిలో రూ.22 కోట్లతో రిక్రియేషన్ జోన్‌ను అభివృద్ధి చేసేందుకు అధికారులు ప్లాన్ రూపొందించారు.

రెండేళ్లలో అత్యధిక లేఅవుట్ల అభివృద్ధి

పేదలకు ఒక సెంట్ భూమిని అందించేందుకు జిల్లాలో 4,828 ఎకరాల్లో అభివృద్ధి చేసిన 83 కాలనీల్లో రూ.175 కోట్లతో శాశ్వత, తాత్కాలిక మౌలిక సదుపాయాలను కల్పించారు. ఈ పథకం కోసం భూములు ఇచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లను అందించేందుకు రూ.200 కోట్లతో 46 లేఅవుట్ల అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. వీటిల్లో సుమారు 2 వేల మంది రైతులకు ప్లాట్లను డెవలప్ చేసి అందించనున్నారు. ఇందుకు సంబంధించి స్టాంప్ డ్యూటీ మినహాయింపుపై కూడా త్వరలోనే నిర్ణయం వచ్చే అవకాశం ఉంది. రూ.75 కోట్ల అంచనా వ్యయంతో 6 ఎంఐజీ కాలనీలు అభివృద్ధి చేస్తున్నారు. వీటి ద్వారా వచ్చిన 1505 ప్లాట్లలో 250కి పైగా ప్లాట్లు అమ్ముడుపోయాయి. మరో రెండు కాలనీలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులకు లాటరీ నిర్వహించి విక్రయించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

రూ.10 కోట్లతో కైలాసగిరి అభివృద్ధి

కైలాసగిరిపై రూ.10 కోట్లతో పూర్తి చేశారు. ఎంట్రన్స్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడమే కాకుండా నూతన రోడ్లు నిర్మించారు. కొండపై బీచ్, హిల్, సీ ఇలా కొత్తగా మూడు వ్యూపాయింట్లను అభివృద్ధి చేశారు. రూ.75 లక్షలతో తెలుగు మ్యూజియంలో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. శివ, పార్వతుల విగ్రహాలకు మెరుగులు దిద్దడంతో పాటు అక్కడ మ్యూజికల్ ఫౌంటేన్, ట్రీ ఆర్చ్, కొత్తగా టైల్స్ ఇలా అన్ని సౌకర్యాలు కల్పించారు. రూ.35 లక్షలతో జాగింగ్ ట్రాక్‌ను రెడ్ సాయిల్‌తో ఏర్పాటు చేశారు.

- తెన్నేటి పార్కు వద్ద రూ.77 లక్షలతో పార్కింగ్ స్థల విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు.
- పెందుర్తి మండలం చీమలాపల్లిలో రూ.5.95 కోట్లతోను, ఎండాడ వద్ద రూ.6.87 కోట్లతోను జీ+1 తరహాలో వెయ్యిమందికి సరిపోయే విధంగా కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.
- ఎన్‌డీపీ పై ఓవర్ దగ్గర రైల్ ఓవర్ బ్రిడ్జ్ పనుల విషయంలో రైల్వే శాఖ సందేహాలను నివృత్తి చేసి 2024 జనవరి నాటికి రూ.28 కోట్లతో ఆర్‌వోబీ పూర్తి చేసే విధంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.
- రూ.30 కోట్లతో 7 ప్రాంతాల్లో మాస్టర్‌ప్లాన్ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

లీజులు, వేలంపై ప్రత్యేక దృష్టి

కైలాసగిరిపై టాయ్ ట్రైన్ కాంట్రాక్టర్ సక్రమంగా నిర్వహించకపోవడంతో కాంట్రాక్టర్‌ను తొలగించారు. వీఎంఆర్డీఏ స్వయంగా ఈ ప్రాజెక్టును నిర్వహిస్తోంది.

- రోప్‌వేకు సంబంధించి కూడా ఉన్న చిన్న చిన్న ఇబ్బందులను తొలగించడంతో సంస్థకు రావాల్సిన పాత బకాయిలు రూ.2.25 కోట్లను వసూలు చేశారు.
- వీఎంఆర్‌డీఏ గతంలో అభివృద్ధి చేసిన లేఅవుట్లలో 2 వేల వరకు వేకెంట్ ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. వాటికి ఈ–కొనుగోలు ద్వారా ఆన్‌లైన్ వేలం నిర్వహించి 60 ప్లాట్లు, రెండు బల్క్ ల్యాండ్స్‌ను విక్రయించడం ద్వారా సంస్థకు రూ.51 కోట్లు ఆదాయం వచ్చింది.
- వీఎంఆర్‌డీఏకు సంబంధించి 587 షాప్స్ ఉండగా.. వేలంలో 460 షాపులను లీజులకు అప్పగించారు. మిగిలిన షాపులతో పాటు 5 ఆడిటోరియాలకు కూడా వేలం ప్రక్రియ చేపడుతున్నారు.

పిల్లల కోసం ప్రత్యేక ప్యాకేజీలు

విద్యార్థులు మ్యూజియాలను సందర్శించేలా నాలుగు కొత్త ప్యాకేజీలను తీసుకువచ్చారు. ఇతర సందర్శకుల కోసం తక్కువకే ఇంటిగ్రేటెడ్ టికెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. డిజిటల్ చెల్లింపులు ప్రోత్సహించేందుకు ఈ నెల 10వ తేదీ నుంచి నగదు రహిత లావాదేవీలకు సన్నాహాలు చేస్తున్నారు.

ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు

ఎల్ఆర్ఎస్‌కు అక్టోబర్ వరకు గడువు పొడిగించారు. దీని ద్వారా ఇప్పటివరకు రూ.32.62 కోట్లు ఆదాయం సమకూరింది. 3,405 దరఖాస్తులను పరిష్కరించగా.. 2,309 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి సంబంధించి అవసరమైన పత్రాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని దరఖాస్తులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిధుల సమీకరణపై ప్రత్యేక దృష్టి

వీఎంఆర్డీఏ చేపడుతున్న ప్రాజెక్టులకు నిధుల సమీకరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జగనన్న కాలనీల అభివృద్ధికి ఖర్చు చేసిన నిధుల కోసం ప్లాట్ల రూపంలో కాకుండా బల్క్ ల్యాండ్స్ కావాలని ప్రభుత్వాన్ని కోరగా ఇప్పటికే 50 శాతం కేటాయించింది. వీటిని ప్లాట్లుగా అభివృద్ధి చేసి విక్రయించడం ద్వారా సంస్థకు భారీగా ఆదాయం సమకూరనుంది. మధురవాడలో 87 ఎకరాలు సంస్థ పరిధిలో ఉన్నాయి. అలాగే ఆర్‌కే బీచ్ వద్ద ఉన్న స్థలం ఏపీఐఐసీ నుంచి వీఎంఆర్డీఏకు ప్రభుత్వం అప్పగించింది.

ఉద్యోగులకు పదోన్నతులు

వీఎంఆర్డీఏలో 20 ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. ఇంజినీరింగ్ విభాగాన్ని మరింత పటిష్టపరిచేందుకు 10 మంది యువ ఇంజనీర్లను నియమించారు.

- వీఎంఆర్డీఏ ఆవిర్భావం నుంచి సుమారు 45 ఏళ్లలో 60 వరకు లేఅవుట్లు వేయగా.. గత రెండేళ్లలో 83 జగనన్న కాలనీలు, 46 ఆర్‌సీ, 6 ఎంఐజీ కాలనీలు అభివృద్ధి చేశారు. రానున్న 6 నెలల నుంచి ఒక ఏడాదితో ఈ ప్రాజెక్టులన్నీ ప్రగతిలోకి తీసుకువస్తామని మెట్రోపాలిటన్ కమిషనర్ మల్లికార్జున స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, సెక్రటరీ రంగయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి ఉన్నంత మాత్రాన ఎర్రమట్టి దిబ్బలు కాదు

ఎర్రమట్టి దిబ్బలు నేరెళ్ల వలసలో ఉన్నాయి. దానికి అనుకొని కొత్తవలస ఉంది. ప్రస్తుతం ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించిన భూములు కొత్తవలస గ్రామానికి చెందినవి. ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు ఇచ్చిన రైతులకు ఆర్‌సీ ప్లాట్లు ఇవ్వడంతో పాటు మిగిలిన స్థలం వీఎంఆర్డీఏ పరిధిలో ఉండనుంది. 1978–80 ప్రాంతంలో ఆ భూములను వ్యవసాయం కోసం రైతులకు డీ పట్టాలు ఇచ్చారు. రైతులకు ఉన్న హక్కుల మేరకు వారు ల్యాండ్ పూలింగ్‌కు ముందుకు వచ్చారు. ఎర్రమట్టి దిబ్బలకు 45 మీ. దూరంలో పూలింగ్ చేసిన భూములు ఉన్నాయి. దిబ్బలకు దూరంగా ఉన్నప్పటికీ ఆ ప్రాంతం వైపు గ్రీనరీ, పార్కులను మాత్రమే అభివృద్ధి చేయనున్నారు. మిగిలిన ప్రాంతాల్లో ప్లాట్లను అభివృద్ధి చేయనున్నారు.

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గోవిందరావు



ఇ.గోవిందరావు

విశాఖ లీగల్: నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది ఇ.గోవిందరావు నగరంలోని ప్రధాన మెట్రోపాలిటీ సెషన్ కోర్టు అదనపు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర న్యాయ వ్యవహారాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. గోవిందరావు మాదకద్రవ్యాలు, గంజాయి నిషేధిత మత్తు మందులు వంటి కేసులకు ఏపీపీగా వ్యవహరిస్తారు. ఆయన నియామకం పట్ల రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కృష్ణమోహన్, బైపా అరుణ్‌కుమార్, పి.నర్సింగరావు, ఉపాధ్యక్షుడు రామ జోగేశ్వరరావు, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షురాలు బి.ఎస్.లత హర్షం వ్యక్తం చేశారు.

పదవీ విరమణ పొందిన హోంగార్డ్స్‌కు చెక్కులు



పదవీ విరమణ పొందిన హోంగార్డుకు చెక్కును అందజేస్తున్న ఇన్‌చార్జి కమాండెంట్ మహేష్

దొండపర్తి: పదవీ విరమణ పొందిన ముగ్గురు హోంగార్డులు కె.గున్నయ్యశెట్టి, ఎం.తిరుమలరావు, ఎం.శంకరరావులకు రూ.4 లక్షలు చొప్పున చెక్కులను హోంగార్డ్స్ ఇన్‌చార్జి కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్, ఆర్ఐ(అడ్మిన్ అండ్ హోంగార్డ్స్) టి.భగవాన్‌లు శనివారం అందజేశారు. అలాగే జూన్ 9వ తేదీన మరణించిన హోంగార్డు ఎస్.అప్పారావు భార్య ఎస్.కుమారికి హోంగార్డ్స్ ఒక రోజు వేతనం కాంట్రిబ్యూషన్‌గా రూ.6 లక్షల వరకు చెక్కును అందించారు.

రైతు భరోసా కేంద్రాల సేవలు భేష్

ఆనందపురం: రైతు భరోసా కేంద్రాల పనితీరు భేషుగ్గా ఉందని, వీటి వల్ల రైతులకు మంచి సేవలు అందుతున్నాయని కేంద్ర బృంద సభ్యులు ప్రశంసించారు. మండలంలోని వేములవలస రైతు భరోసా కేంద్రాన్ని వారు శనివారం సందర్శించారు. కేంద్ర ఎరువులు సరఫరా నియంత్రణ కార్యాలయం డైరెక్టర్ (మూవ్‌మెంట్) హరివీంద్ర సింగ్, వ్యవసాయ శాఖ కార్యాలయం జాయింట్ డైరెక్టర్ (ఇన్‌పుట్స్) కమిషనర్ విడివి కృపదాస్, ఇతర అధికారులు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి వ్యవసాయాధికారులను, రైతులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతు భరోసా కేంద్రాలలో ఏర్పాటు చేసిన కియాస్క్ ద్వారా రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలను బుక్ చేసుకోవడం, వాటిని సకాలంలో రైతులకు అందించడం, వ్యవసాయ ఉత్పత్తులు విక్రయం, పంటలు బీమా కోసం ఈ క్రాపింగ్ విధానం, కస్టమర్ హైరింగ్ సెంటర్ (సిహెచ్‌సి) ద్వారా రైతులకు అద్దె ప్రాతిపదికన యంత్ర పరికరాలు సరఫరా వంటి విషయాలను పరిశీలించారు. రాష్ట్రంలో రైతులు కోసం అమలు చేస్తున్న పథకాలు, అందుతున్న సేవలను తెలుసుకొని అభినందించారు. పూర్తి వివరాలను నివేదిక రూపంలో కేంద్రానికి అందజేస్తామని అధికారుల బృందం తెలిపింది.



వేములవలస రైతు భరోసా కేంద్రాన్ని సందర్శిస్తున్న కేంద్ర బృందం

ఈ కార్యక్రమంలో భీమిలి డివిజన్ సహాయ సంచాలకుడు బి.విజయ్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి సంధ్యారత్న ప్రభ, వీఏఏ అహమ్మద్ గౌస్, ఏహెచ్ఏ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన

అధికారులకు కలెక్టర్ ఆదేశం

మహారాణిపేట: విశ్వకర్మ జయంతి సందర్భంగా ఈ నెల 17న ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రధాని మోదీ ప్రారంభిస్తారని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో శనివారం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం అమల్లో భాగంగా జిల్లాస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. పథకంలో భాగంగా 18 రకాల వృత్తి, హస్తకళా వ్యాపారాలను గుర్తించినట్లు చెప్పారు. లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దంచికొట్టిన వాన



సాక్షి, విశాఖపట్నం: నగరంలో శనివారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. ఉదయం నుంచి సాధారణంగానే ఉన్న వాతావరణం సాయంత్రానికి ఒక్కసారిగా మారిపోయి.. భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. కొన్ని రోజులుగా తీవ్ర ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన నగరవాసులు ఈ వర్షంతో కాస్త ఉపశమనం పొందారు.



ప్రాంతం	కురిసిన వర్షం (మి.మీలలో)
జూపార్క్	67
ఆరిలోవ	60.25
సాగర్ నగర్	55.5
జోగవానిపాలెం	50.75
ఎండాడ	50.25
శ్రమశక్తి నగర్	42.75
వేపగుంట	42.5
సీతమ్మధార	39.5
సింహాచలం	28.25
మధురవాడ	23.0
రైల్వే న్యూకాలనీ	21.0
జ్ఞానాపురం	20.75




బీచ్‌రోడ్డులో..



తెలుగుతల్లి ఫ్లైఓవర్ పక్కన నిలిచిన నీరు

మహాశ్రేష్ఠం.. మట్టి గణపతి

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వద్దు
- పర్యావరణహితంగా వినాయక చవితి జరుపుకుందాం
- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



డాబాగార్డెన్స్: అగ్రగామి నగరంగా భాసిల్లుతున్న విశాఖలో పర్యావరణహితంగా వినాయక చవితిని జరుపుకుందామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ఉపయోగించొద్దని, ఒకవేళ ఉపయోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు తయారు చేసే వారి నుంచి మార్కెట్లోకి బొమ్మలు వెళ్లకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్ 5న పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని 'ఎకో–వైజాగ్' కార్యక్రమం ప్రారంభించామని.. ఇందులో భాగంగా ఎకో–క్లీన్, ఎకో–గ్రీన్, ఎకో–బ్లూ, ఎకో–జీరో ప్లాస్టిక్, ఎకో–జీరో పొల్యూషన్ పేరిట ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎకో–జీరో ప్లాస్టిక్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, సచివాలయ, జీవీఎంసీ సిబ్బందితో కలిసి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ప్రత్యేకంగా నిఘా పెట్టామన్నారు. ఇప్పటివరకు 63,415 దాడులు చేసి, 4,250 కిలోల ప్లాస్టిక్‌ను సీజ్ చేశామన్నారు. రూ.38,58,258 జరిమానా వసూలు చేసినట్లు వెల్లడించారు.

మట్టి గణపతినే పూజిద్దాం

వినాయక చవితిని పర్యావరణహితంగా జరుపుకునేందుకు జీవీఎంసీ తగిన జాగ్రత్తలు చేపట్టిందని కమిషనర్ తెలిపారు. ఇప్పటికే విగ్రహాల తయారీదారులతో సమావేశం నిర్వహించామని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మెటీరియల్‌కు బదులు మట్టితో ప్రతిమలు తయారు చేయాలని సూచించామన్నారు. మండపాల ఏర్పాటులో కూడా ప్లాస్టిక్‌ను కాకుండా.. పర్యావరణ హిత వస్తువులను వాడాలని సూచించారు. విగ్రహాల నిమజ్జనం కోసం పలు ప్రాంతాల్లో నీటితో కూడిన వాహనాలు ఏర్పాటు చేస్తామని, వీటిని నగర ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 'ఎకో–బ్లూ'లో భాగంగా బీచ్ క్లీనింగ్ కోసం ఆరు మెషీన్లు వినియోగిస్తున్నట్లు చెప్పారు.
- వ్యర్థాల నిర్వహణకు అత్యంత కీలకమైన ఆర్ఆర్ఆర్(రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) పద్ధతిని ప్రోత్సహించేందుకు నగరంలో జోన్‌కి ఒకటి చొప్పున 8 సెంటర్లు ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ తెలిపారు. గాజు, కాగితం, మెటల్, ప్లాస్టిక్, టైర్లు, వస్త్రాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్, పాత దుస్తులు, పాత చెప్పులు, తదితర వస్తువులను ట్రిబుల్ ఆర్ సెంటర్ల ద్వారా సేకరించి.. వాటిని పునర్వినియోగిస్తున్నట్లు చెప్పారు.
- విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ, సామాజిక బాధ్యత కలిగించేందుకు రేంజర్‌ఫోర్స్ అనే ఎన్‌జీవోతో కలిసి 520 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఎకో–వైజాగ్ కిడ్స్ ఆర్ట్ కాంటెస్ట్ పేరిట చిత్రలేఖనం పోటీలు నిర్వహించామన్నారు.
- ఎకో వైజాగ్ క్యాంపైన్‌లో నగర పౌరులతో పాటు విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, ఎన్‌జీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్‌లు, వాణిజ్య వ్యాపార సంస్థల ప్రతినిధులతో ఇటీవల వైజాగ్ బీచ్‌వాక్ చేపట్టామన్నారు.
- ప్రజారోగ్య విభాగంలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మరణించిన, 60 ఏళ్లు పైబడిన, ఇతర కారణాలతో ఏర్పడిన 482 ఖాళీలు భర్తీకి గతేడాది డిసెంబర్‌లో నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ఇప్పటివరకు 227 మంది విధుల్లోకి తీసుకున్నట్లు చెప్పారు. మిగిలిన పోస్టుల భర్తీ విషయమై ఓ కమిటీ వేసి, రోస్టర్ ప్రకారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.
- నగరంలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా తదితర వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి ఆగస్టు 31 వరకు 71 మలేరియా, 568 డెంగ్యూ, రెండు చికున్ గున్యా కేసులు నమోదయ్యాయని కమిషనర్ వివరించారు.

వనం వదిలి.. జనంలోకి..



సాక్షి, విశాఖపట్నం: ఒకప్పుడు అడవులకే పరిమితమైన వన్యప్రాణులు వనం వదిలి.. జనంలోకి వచ్చేస్తున్నాయి. వారం రోజులుగా ఎండలు విపరీతంగా ఉండటంతో.. కంబాలకొండలో ఉన్న జింకలు తాగునీటి కోసం శనివారం ఉదయాన్నే జాతీయ రహదారిపైకి చేరుకున్నాయి. ఒక్కసారిగా జనారణ్యంలో ప్రత్యక్షమైన జింకల్ని చూసి వాహనచోదకులు ఆశ్చర్యపోయారు. జనాల అలికిడితో భయాందోళనలకు గురైన జింకలు.. తిరిగి కంబాల కొండవైపు పరుగులు తీశాయి.



కళాకారులకు 'వైభవ్' ప్రోత్సాహం

మద్దిలపాలెం: కళాకారులను వైభవ్ జ్యూయలర్స్ ప్రోత్సహిస్తుందని మనోజ్ వైభవ్ జెమ్స్, జ్యూయలర్స్ లిమిటెడ్ చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లికా మనోజ్ అన్నారు. మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం జరిగిన జాతీయ సంగీత నాటకోత్సవాల్లో ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత అన్నవరపు రామస్వామికి వైభవ్ జ్యూయలర్స్ తరఫున స్వర్ణ కమలం ప్రదానం చేసినట్లు తెలిపారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కార్పొరేట్ సామాజిక సేవలో భాగంగా 2002 నుంచి కళాకారులకు స్వర్ణ కమలం అందజేస్తున్నట్లు వెల్లడించారు.



అన్నవరపు రామస్వామికి స్వర్ణ కమలం అందిస్తున్న మల్లికా మనోజ్

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

విశాఖ స్పోర్ట్స్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మేయర్ హరివెంకట కుమారి అన్నారు. స్వర్ణభారతి స్టేడియంలో నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు. రెండు రోజుల పాటు సాగే ఈ పోటీల్లో 10 నుంచి 18 ఏళ్ల లోపు క్రీడాకారులు పోటీపడుతున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధులు మాగరాజు, లక్ష్మి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.143
స్కిన్	: రూ.256
స్కిన్‌లెస్	: రూ.266

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	480.00
విజయనగరం	484.00
శ్రీకాకుళం	484.00

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.